సమస్యల్లో వాకింగ్ ట్రాక్



వాకింగ్ ట్రాక్‌లోకి వెళ్లేందుకు గణేష్‌నగర్ రోడ్డులో తొలగించిన ఫెన్సింగ్, ఏర్పాటు చేసిన మెట్లు



గ్రీన్‌బెల్ట్ ట్రాక్‌లో తాగి పడేసిన మందు బాటిళ్లు

- గ్రీన్‌బెల్ట్‌లో మందుబాబుల ఆగడాలు
- మూడు చోట్ల కంచె తొలగింపు
- ఇబ్బంది పడుతున్న స్థానిక మహిళలు

సీతంపేట: ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లతో ఆహ్లాదంగా తీర్చిదిద్దిన గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలకు సమస్యలు ఎదురయ్యాయి. జీవీఎంసీ 25వ వార్డు సత్యం కూడలి వద్ద హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఇటీవల అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్‌కు రక్షణ కరువైంది. జీ20 సదస్సు నేపథ్యంలో హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లతో ఆహ్లాదకరంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దారు. సత్యం సెంటర్‌లోని గ్రీన్‌బెల్ట్‌లో ఒకవైపు ఓపెన్ జిమ్.. మరో వైపు పొడవైన వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఈ రెండు అందుబాటులోకి రావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. చిన్నా, పెద్దా అన్ని వయసుల వారితో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లు ఉదయం, సాయంత్రం కళకళలాడుతున్నాయి. ఇలా కొన సాగుతుండగా.. వాకింగ్ ట్రాక్‌కు రక్షణ కరువైంది. అక్కడ చేరిన మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చీకటి పడితే చాలు..

గ్రీన్‌బెల్ట్ ప్రాంతానికి హైవే వైపు రక్షణగా కొత్తగా కంచె ఏర్పాటు చేశారు. గణేష్‌నగర్ రోడ్ వైపు గతంలో ఏర్పాటు చేసిన పాత కంచెను అలాగే ఉంచారు. కొంత మంది ఈ కంచెను మూడు చోట్ల తొలగించి వాకింగ్ ట్రాక్‌లోకి వెళ్లేందుకు మార్గాలు ఏర్పాటు చేసుకున్నారు. ట్రాక్ గేటుకు తాళం వేసి ఉన్నా.. ఈ మార్గాల నుంచి దర్జాగా లోనికి వెళ్తున్నారు. చీకటి పడితే మందుబాబులు ట్రాక్ లోపలికి ప్రవేశించి ఓపెన్ బార్‌గా వినియోగిస్తున్నారు. వారి ఆగడాలతో ఇన్నాళ్లు చెత్తాచెదారంతో ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతం ఆహ్లాదంగా తీర్చిదిద్దారన్న సంతోషం లేకుండా పోయిందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి, 11, 12 గంటల వరకు మందుబాబులతో ఇబ్బందిగా ఉందని, వేసవి కాలం గాలి కోసం ఇళ్ల ముందుకూర్చుంటే, మందుబాబులతో ఇబ్బంది పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇదేంటని వారిని ప్రశ్నిద్దామంటే తాగిన మత్తులో తిరగబడతారేమోనని భయంతో ఊరుకుంటున్నట్టు తెలిపారు. గణేష్‌నగర్ రోడ్ వైపు గోడ ఎత్తుచేసి దానిపై కంచె ఏర్పాటు చేస్తే ఇటువంటి ఆగడాలకు అడ్డుకట్ట వేయచ్చని సూచిస్తున్నారు.



వాకింగ్ ట్రాక్‌లో అడ్డుగా ఉన్న చెట్ల మొదళ్లు



వాకింగ్ ట్రాక్ పక్కన ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ బాక్స్

వాకర్స్ విజ్ఞప్తి

ట్రాక్ మధ్యలో తొలగించిన చెట్లు తాలూకా మొదళ్లు ఉండి పోవడంతో నడిచే వారి కాళ్లకు తగులుకొని పడిపోతున్నారు. వాటిని తొలగించాలని వాకర్స్ కోరుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ట్రాక్ చుట్టూ ఉన్న మట్టి ప్రదేశాన్ని లెవెల్ చేసి మొక్కలతో పార్కులా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ట్రాక్ పక్కనే విద్యుత్ ఫ్యూజ్ బాక్సుకు రక్షణ లేక ప్రమాదకరంగా ఉందని, దానిని సరిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టాండింగ్ కమిటీలో ప్రతిపాదనలు



జీ20 సదస్సు నేపథ్యంలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో కొత్తగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గ్రీన్‌బెల్ట్‌కు ఒకవైపు ఫెన్సింగ్ తొలగించారని, చుట్టుపక్కల వారికి మందుబాబులతో ఇబ్బంది కలుగుతున్నట్టు నా దృష్టికి వచ్చింది. వాకింగ్ ట్రాక్ రక్షణకు చర్యలు చేపట్టేలా స్టాండింగ్ కమిటీలో ప్రతిపాదనలు పెడతాను. అక్కడ గస్తీ పెంచాలని ద్వారకా స్టేషన్ పోలీసులను కోరుతాం.

– సారిపిల్లి గోవింద్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 25వ వార్డు కార్పొరేటర్

అధినేతను కలిసిన కె.కె.రాజు, శ్రీధర్‌రెడ్డి





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ప్రభుత్వ సలహాదారుడు శ్రీధర్‌రెడ్డి

సీతమ్మధార: వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు బుధవారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ ఎయిర్‌పోర్టులో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు(స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. అధినేతకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

రైల్వే గ్రౌండ్స్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: రైల్వే గ్రౌండ్స్‌లోని వాకర్స్ పార్క్‌ను బుధవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్క్‌ను మరింత సుందరంగా తయారుచేసి నగరంలోనే ఒక మోడల్ పార్క్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పార్క్‌ను ప్రధానంగా నగర పౌరులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు వాకింగ్ కోసం వినియోగిస్తున్నారు. పూర్తిగా పచ్చదనంతో, కూర్చునేందుకు అనువైన సదుపాయాలతో ఈ పార్క్‌ను తయారుచేశారు. పర్యటనలో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్.కె.సారంగి, సీనియర్ అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వాకర్స్‌లో పార్క్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, రైల్వే అధికారులు

'నాడు–నేడు' నిధుల లెక్క చెప్పండి

ఎస్‌ఎంసీహెచ్ స్కూల్ హెచ్‌ఎంను విచారించిన డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీ ఎస్‌ఎంసీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్‌ను బుధవారం నాడు–నేడు కార్యక్రమ పనులపై డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు విచారించారు. కలెక్టరేట్‌లో గత నెల 24న జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఎ.మల్లికార్జునకు హెచ్‌ఎం రాంప్రసాద్‌పై ఫిర్యాదు చేస్తూ స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ రఘు వినతిపత్రం అందించారు. స్పందించిన కలెక్టర్.. దీనిపై విచారించాలని డీఈవో చంద్రకళకు ఆదేశించారు. ఆమె డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావును విచారణ అధికారిగా నియమించారు. బుధవారం ఉదయం పాఠశాలలో సుమారు ఎనిమిది ఫిర్యాదుల మేరకు డిప్యూటీ డీఈవో విచారణ చేపట్టారు. హైస్కూల్‌లో నాడు–నేడు పనులపై ఎంత బడ్జెట్ ఖర్చు చేశారో వివరాలు అడిగి సేకరించారు. ఈ ఏడాది స్కూల్ అభివృద్ధికి వచ్చిన నిధులను ఏ విధంగా ఖర్చు చేశారో బిల్లులు తీసుకురావాలని అధికారి ఆదేశించారు. స్పందనలో ఇచ్చిన ఫిర్యాదులో హెచ్‌ఎంగా ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్‌కు గురైన హెచ్‌ఎంను మళ్లీ నియమించడంపై అభ్యంతరం తెలిపారు. ఎస్‌ఎంసీహెచ్ స్కూల్‌లోని ప్లస్–2 గర్ల్స్ ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న బోటనీ లెక్చరర్ పోస్టును భర్తీ చేయాలని సూచించారు. స్కూల్‌కు వచ్చిన నిధులను సక్రమంగా ఉపయోగించడం లేదని, దీనిపై విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ మెంబర్ ఎం.ఇందర, రాజ్యలక్ష్మి, విచారణ అధికారులు పాల్గొన్నారు.



హెచ్‌ఎం రాంప్రసాద్‌ను విచారిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు

7న అల్లూరి వర్ధంతి కార్యక్రమాలు

ఏయూ క్యాంపస్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమాలు ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగు, సంగీత నృత్య శాఖల సంయుక్తంగా సమైక్య భారతి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఈ నెల 7న నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఏయూ సంగీత విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెక్టార్ ఆచార్య కె.సమత ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అల్లూరి తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక అని అన్నారు. అటువంటి మహనీయుడిని స్మరించుకోవలసిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. బీచ్ రోడ్డులో 7వ తేదీ ఉదయం 10 గంటలకు గాంధీ పార్కు, దసపల్లా హిల్స్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులో స్వాతంత్ర్య సమరయోధుల మైదానంలో సంగీత నృత్య శాఖల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో విజయ నిర్మాణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.విజయకుమార్, సంగీత నృత్య విభాగాధిపతి ఆచార్య ఎ.అనురాధ, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.సరస్వతి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బూసి వెంకటస్వామి, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

జోరువానతో ఇక్కట్లు



సీతమ్మధార రైతుబజార్‌లో చేరిన వాన నీరు

సీతమ్మధార: నగరంలో బుధవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. సీతమ్మధార మెయిన్ రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ బయట, అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నీరు చేరింది. వాన ప్రభావానికి సీతమ్మధార రైతుబజార్‌లో వ్యాపారాలు సాగలేదు. నక్కవానిపాలెం, బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారుల్లో మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. రేసపువానిపాలెం, కేఆర్‌ఎం కాలనీల వీధుల్లోని కాలువలు, గోతుల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. వివిధ పనుల నిమిత్తం బయటకొచ్చిన ప్రజలు జోరువానకు అవస్థలు పాలయ్యారు.



ఊర్వశి కూడలి - కంచరపాలెం రోడ్డులో వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న వాహనాలు

నీటమునిగిన రహదారులు

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు, డ్రైనేజీలు, కాలువలు నీట మునిగాయి. రాకపోకల సమయంలో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. అడుగులోతు నుంచి నీటిలో పాదచారులు రాకపోకలు సాగించారు. కొండవాలు ప్రాంతాల నుంచి వర్షపు నీరు జాతీయ రహదారుల్లోకి చేరడంతో భారీ వాహనాలు నీటిని తుళ్లగొడుతూ ప్రయాణించాయి. చెత్తాచెదారం, మురుగు నీరు వీధుల్లో చేరడంతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

క్లుప్తంగా

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు బుధవారం ఈవో కొండబాబు డ్రా తీశారు. ఉదయం 90 మంది రైతులకు సంబంధించి 63 స్టాళ్లను, సాయంత్రం 70 మందికి సంబంధించి 63 స్టాళ్లను కేటాయించి, రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పది రోజులకు ఒకసారి రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పాలిసెట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం నమూనా పాలిసెట్ పరీక్ష నిర్వహించారు. 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి ఇప్పటికే ఉచిత మెటీరియల్ అందించా రు. ఈ నెల 6 వరకు కోచింగ్ కొనసాగి స్తారు. ఈ నెల 10న పాలిసెట్ రాయాల్సి ఉంటుంది. ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ ఏఎస్సార్ నగర్ 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కామాక్షినగర్, ఇందిరానగర్–1 , బర్మా క్యాంప్, ఏఎస్సార్ నగర్, పల్నాటి కాలనీ, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శశికళ

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో కంచరపాలెం జోన్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ఓమ్ని ఆర్కే, మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ శిబిరాన్ని ప్రారంభించి పరిశీలించారు. పలువురి స్థానికులకు వైద్య సిబ్బంది నేత్ర వైద్య పరీక్షలు చేసి సూచనలిచ్చారు. కార్యక్రమంలో బౌద్ధాలయ ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్, సంఘ అధ్యక్షుడు మల్లువలస రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, సీనియర్ సభ్యులు తీడ సన్యాసిరావు, కె.ధనంజయరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి ఇందులో పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

మహిళా వాకర్స్ క్లబ్ వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న మహిళా వాకర్స్ ప్రతినిధులు

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ 17వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని బెగ్గర్స్ షెల్టర్‌లో ఉంటున్న నిరాశ్రయులకు, రైల్వే స్టేషన్ రోడ్‌లో ఫుట్‌పాత్ యాచకులకు నిత్యావసర సరకులు అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రైబల్ డవలప్‌మెంట్(ఏయూటీడీ) ద్వారా అందజేశారు. 50 కేజీల బియ్యం, పప్పులు, పంచదార, గోధుమ పిండితోపాటు వీరు సేకరించిన పాత దుస్తులు, దుప్పట్లు, నైటీలు, చీరలు, చొక్కాలు, ప్యాంట్‌లను సంస్థ ప్రతినిధులు వాసు, జ్యోతిలకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, కోశాధికారి లక్ష్మి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, లీలానాయుడు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సుభాషిణి, పద్మజ పాల్గొన్నారు.

కవులకు పరిశీలన అవసరం

సీతంపేట: కవిత్వం రాసే నవకవులంతా ప్రముఖ కవులు, రచయితల రచనలు చదవడం, పరిశీలించడం అలవాటు చేసుకోవాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సూచించారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నవకవుల మార్గదర్శి శ్రీశ్రీ అని, కవి మనిషి రుణం తీర్చుకునేందుకు సమాజ చైతన్యం కోసం పద్యాలు అల్లుతాడని, ప్రజల గొంతు వినిపిస్తాడని, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని ఆవిష్కరిస్తాడని తెలిపారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల దివంగతుడైన చిత్రకారుడు బాలి గొప్పతనాన్ని, కళా విశిష్టతను వివరించి నివాళులర్పించారు. ఇటీవల కళాసేవలో నంది పురస్కారం అందుకున్న జి.కె.సుబ్రహ్మణ్యం, హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాల్లో సత్కారం పొందిన రామతాతలను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు చిన సూర్యనారాయణ, కవిత గమనం గమ్యం, రామతాత కవిత ధరాఘాతం, బి.రాధారాణి కబీర్ దాసు దోహాలు, కె.వి.ఎస్.మూర్తి కవిత భయం, కొత్తూరి రమణ ఊరగాయోపాఖ్యానం కవితలు చదివి వినిపించారు.



సుబ్రహ్మణ్యం, రామతాతలను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

ఇస్కాన్‌లో వేడుకలు నేడు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో గురువారం నరసింహ చతుర్దశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ తెలిపారు. తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనం, హారతి, గురుపూజ, నరసింహ యజ్ఞం, సాయంత్రం కీర్తనలు, అభిషేకం చేస్తామన్నారు.

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా గొయ్యి

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అబిద్‌నగర్ షాదీఖానా రోడ్డులో సామాజిక మరుగుదొడ్ల వద్ద తవ్వి వదిలేసిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తాగునీటి పైప్‌లైన్ లీకవుతోందని మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి పనులు పూర్తయ్యాక పూడ్చకుండా వదిలేశారు. ఐదు నెలలు గడుస్తున్నా.. ఇదే పరిస్థితి. చిన్నపిల్లలు గోతిలో పడే ప్రమాదముంది. వర్షం కురిస్తే నీటితో నిండి గొయ్యి కనిపించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యి పూడ్చేలా చర్యలు చేపట్టాలి.

– జి.శ్రీనివాసరావు, అబిద్‌నగర్



షాదీఖానా రోడ్డులో తవ్వి వదిలేసిన గొయ్యి

వీధిలైటును వెలగించండి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు మహారాణి పార్లర్ ఎదురుగా చిన్నూరు 80 ఫీట్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన వీధిలైటు వెలగడం లేదు. స్తంభానికున్న రెండు లైట్లలో ఒకటి మాత్రమే వెలుగుతోంది. రాత్రి వేళ చీకట్లో ఇబ్బందిగా ఉంటోంది. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

– జి.రామునాయుడు, అక్కయ్యపాలెం



చిన్నూరు రోడ్డులో వెలగని వీధి లైటు

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నక్కవానిపాలెంలో శ్లాబ్‌ను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో అనధికారికంగా నిర్మించిన భవనాలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేస్తున్నారు. నక్కవానిపాలెంలోని 3వ అంతస్తులో అక్రమంగా చేపట్టిన కట్టడాన్నిఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం తొలిగించారు. పలువురు చైన్‌మేన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

డాబాగార్డెన్స్: రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలోని అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. కథలు.. కథనాలు.. సృజనాత్మక కళలతో శిబిరాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా 36వ వార్డు రంగిరీజు వీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు జరిగే సమ్మర్ క్యాంపులో పుస్తక పఠనం, సమీక్షలు, పెద్దల నుంచి విన్న ఆముద్రిత కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రంథాలయ పరిసరాల్లోని విద్యార్థులు ఈ వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలని బాలల శాఖ గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి కోరారు.

5న సత్యదేవుని ఆలయంలో బుద్ధ పూర్ణిమ



డాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 5న బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజు వేకువజాము నుంచి పూజలు, సామూహిక, విశేష వ్రతాలు జరపనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశామని, క్యూలైన్లలో తాగునీటి సౌకర్యం కల్పించామని చెప్పారు.

వెంకన్న సన్నిధిలో పండిత సదస్యం



సదస్యంలో పాల్గొన్న వేద పండితులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు. స్వామివారికి బాలభోగం, హోమాలు, అర్చన, నివేదన, మంగళాశాసనాలు చేపట్టారు. ఆలయ కల్యాణ మండపంలో పండిత సదస్యం నిర్వహించారు. వేద పండితులు గురునాథ్ శర్మ, శ్రీనివాసశర్మ, ఘనాపాఠీలు నాలుగు వేదాలు వల్లె వేశారు. వేద పఠనంతో బల్లిగిరి మార్మోగింది. వేంకటేశ్వరుని వైభవాన్ని వారు వివరించారు. అనంతరం ఆలయ ఈవో జీవీ రమాబాయ్ పండితులను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆస్పత్రులు పరిశీలించిన డీఎంహెచ్‌వో

పీఎం పాలెం: స్థానిక కీర్తన, వేదాంత ఆస్పత్రులను బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ రెండు ఆస్పత్రుల్లో అవసరమైన డాక్టర్లు, సిబ్బంది ఉన్నారని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందని ఆయన తెలిపారు. అనంతరం అక్కడి వైద్యులకు ఆయన కొన్ని సూచనలు చేశారు. పేద రోగులను దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని, రుసుములకు సంబంధించిన ధరల పట్టిక, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆస్పత్రి రిసెప్షన్‌లో ప్రదర్శించాలని సూచించారు.



వైద్యులతో మాట్లాడుతున్న జగదీశ్వరరావు